నిర్జనంగా ఉన్న తీరంలో దిగంతాలకు వ్యాపించిన సముద్రం.

భీకరంగా శబ్దం చేస్తూ విరుచుకుపడే అలలూ, అలల తాకిడికి బాధతో నల్లగా కమిలిపోయిందా అన్నట్లున్న రాతిగుట్ట.

ఒంటరిగా ... నిశ్శబ్దంగా ... ఏకాకిలా, నా జీవితానికి ప్రతిబింబంలా నిల్చింది, సముద్రమధ్యంలో.

భీకరమయిన ఘోషలో, అనంతమయిన ఆ నిశ్శబ్దంలో, చివికి మూగబోయిన హృదయంతో శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాను నిర్లిప్తంగా.

నాలుగుపదులు దాటిన నా జీవితంలో నేను ఇంత వరకూ ఏకాకినిగానే జీవిస్తూ వచ్చాను. ఈ ఏకాకిత్వం లోని శూన్యత నే నెవరితోనూ చెప్పుకోలేనిది. కాలం మళ్ళీ నన్ను ఒంటరిజీవితపు పొలిమేరలోనికి నెట్టింది. బాధతో నా గుండె బరువెక్కింది. దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. నిండుకున్న కన్నీళ్లలోనుంచి గతం బాధగా కదిలింది కళ్ళముందు.

**అనవసరమైన గంభీరత ప్రదర్శించి, బెట్టుచేసి, చేతికందిన స్వర్గాన్ని వదులుకోవడం స్త్రీకి, అందునా చదువుకున్న స్త్రీకే అలవాటు. చిన్న తప్పిదాలకు పెద్ద ఫలితాలు అనుభవించడానికి వెనుదీయక సమాజాన్ని, వ్యక్తుల్ని నిందించడం వారికే సాధ్యం. సమయంలో పొందవలసిన సుఖం పొందక, ఏకాకిగా బ్రతికే వనితకు, మమత ఎలా తెలుస్తుంది. మాతృత్వం ఎరగని స్త్రీకి మమకారపు రుచులు తెలియవు గదా! జీవన్మరణ సంఘర్షణలో భూమిమీద పడ్డ పసిబిడ్డవైపు తల్లి చూసే చూపులోని మమకారం, అంచనాలకు మించినదే అవుతుంది.**

* * * *

ఆరోజు ...

ఇల్లంతా సందడిగా ఉంది. అమ్మ పోయిన తరవాత ఇల్లు కలకలలాడటానికి ఆరోజే మొదలు.

సావిత్రి అత్తయ్య చెప్పింది జడ వేస్తూ, పిన్ని వస్తూందిట. అంటే? నాకు అర్థంకాలా? పిన్ని ఎవరూ?

"కొత్త అమ్మ" అంది అత్తయ్య.

అమ్మ జ్ఞాపకంవచ్చి కళ్ళల్లో నీళ్ళు నిల్చాయి.

దోసెడు పెద్దపు జరీఅంచు తెల్లని చీరలో అమ్మ కంటె చిన్నదానిలా అందంగా ఉన్న పిన్నిని దగ్గిరగా వెళ్ళి తాకాలనిపించింది.

నన్ను చూస్తూనే పిన్ని ముఖంలో చీకట్లు అలుముకున్నాయి. జంకుతో వెనక్కి తగ్గాను.

"ఈరోజునుంచి నీ పడక ఇక్కడే" అంది అత్తయ్య వరండాలో మంచం వాలుస్తూ ఆ రాత్రి.

"ఊహూ ... నేను నాన్నదగ్గిరే పడుకుంటా." అత్తయ్య చేతికి చిక్కకుండా ఒక్క పరుగున నాన్న గది చేరాను.

నాన్నపక్కనే కూర్చుని కబుర్లు చెబుతున్న పిన్ని ముఖం చిట్లించింది కోపంగా చూస్తూ.

నీళ్ళు నిండిన కళ్ళతో బొమ్మలా నిల్చుండిపోయిన నన్ను బుజ్జగించి అత్తయ్యదగ్గిర పడుకోబెట్టిన నాన్న రూపం ఇప్పటికీ గుర్తే నాకు. వయస్సుకి మించిన గాంభీర్యంతో బొమ్మల పుస్తకం పట్టుకుని మౌనంగా తిరుగుతూఉండే నన్ను చూస్తే కిట్టేది కాదు పిన్నికి.

తరుచు పిన్ని కోపానికి గురిఅవుతూ ఉండేదాన్ని. సావిత్రి అత్తయ్య వెళ్ళిపోయింది. ఒంటరిగా పడుకోటం అలవాటయింది. గారంగా పెంచిన అమ్మ పని నేర్పలేదు నాకు. పిన్ని సాధింపులు తప్పలేదు.

తరుచు నాగురించి పిన్నీ, నాన్నా ఘర్షణ పడటం నా చిన్ని మనసుకి బాధ కలిగించేది. నిశ్శబ్దంగా కన్నీరు కార్చటంతప్ప నేను చేయగలిగిందీ లేదు.

ఆరాత్రి ... పిన్నీ, నాన్నా పెద్దగా ఘర్షణపడ్డారు నన్ను గురించి. పిన్ని ఉరిపోసుకు చచ్చిపోతానంటూంది. నాన్న గట్టిగా కేకలేసి విసురుగా వీధిలోకి వెళ్ళిపోయారు. భయంతో కళ్ళు మూసుకు పడుకున్న నాకు ఎప్పుడో నిద్ర పట్టేసింది.

తెలతెలవారుతూఉండగా నిద్రలో ఉన్న నన్ను లేపారు నాన్న. ఆయన చేతిలో చిన్న పెట్టె ఉంది.

"లే తల్లీ, వెడదాం!" అన్నారు. ఆయన కంఠం బాధగా ధ్వనించింది. ఎక్కడికో అర్థం కాలేదు. మారుమాట్లాడకుండా వెంబడించాను.

స్టేషన్లో పట్నం పోయే రైలు ఆగిఉంది. "ఎక్కడికి వెడుతున్నాం, నాన్నా?" అన్నాను, వెనక్కి పరిగెడుతున్న పచ్చని చేలనూ, దూరంగా ఆకాశాన్నంటుతున్న కొండల్ని చూస్తూ.

"పట్నంలో స్కూల్లో చేర్పటానికమ్మా. అక్కడ మంచిమంచి పంతులమ్మలూ, నీకంటే చిన్నచిన్న పిల్లలూ చాలామంది ఉంటారు. చక్కగా చదువుకో, తల్లీ!" నాన్న జవాబు బరువుగా వచ్చింది.

నాకు చాలా ఉత్సాహంగా ఉంది. పెదనాన్న కూతురు నళినిలా పెద్దచదువులు చదవాలని నా ఆరాటం.

"మరి మీరో, నాన్నా? మీరుకూడా అక్కడే ఉండరూ?" అన్నాను, నాన్న చెయ్యి గట్టిగా పట్టుకుంటూ.

"నన్నక్కడ ఉండనివ్వరుగా, తల్లీ! నువ్వు చదువుకో. నేను మధ్యమధ్య వచ్చి చూసిపోతూఉంటా." చెమ్మగిలిన కళ్ళతో నన్నే చూస్తూ అన్నారు నాన్న.

"తల్లిలేని పిల్ల. మీకు అప్పగిస్తున్నా." స్కూల్లో హెడ్‌మిస్ట్రెస్‌కు అప్పజెబుతూ కళ్ళు తుడుచుకున్న నాన్న రూపం ఇప్పటికీ గుర్తే నాకు.

ఆయన ఏం చెయ్యబోతున్నారో అర్థం కాలేదు. సీతాకోకచిలకల్లా రంగురంగు దుస్తుల్లో పువ్వుల్లా ఉన్న పిల్లలూ, చిరునవ్వుతో ఆదరంగా దగ్గిరికి తీసుకుంటున్న టీచర్లూ, పూలమొక్కలమధ్య కుటీరంలాంటి గదుల్లో ఉన్న క్లాసులూ ... వీటన్నిటిమధ్య నాన్న వెళ్ళిపోతున్నారనే విచారమే తెలియలేదు నాకు.

**శ్రీమతి పూర్ణానంద్.**

"బాగా చదువుకోమ్మా! మంచిమార్కులు తెచ్చుకోవాలి." గుండెలకు హత్తుకొంటూ అన్నారు నాన్న. ఆయన కంఠం గద్గదమయింది. నాన్న వెళ్ళిపోయారు.

మొదట్లో పాఠాలు అర్థంఅయ్యేవికాదు. నాకంటె చిన్న పిల్లలు చకచకా చెబుతూంటే వింతగా చూస్తూ ఉండిపోయేదాన్ని. రానురాను సందేహాలు మబ్బుల్లా విడిపోయి, అర్థంకావడం ప్రారంభమయేది. మధుర మధురంగా వినిపించే యామినీ టీచర్ కంఠం చెవుల్లో వినిపిస్తున్నట్లే ఉండేది.

సంవత్సరం ఇట్టే గడిచిపోయింది. ఈ మధ్యలో నాన్న రావటంగానీ, ఉత్తరాలు రాయటంగానీ జరగలేదు. పరీక్షలు బాగా వ్రాశాననే సంతృప్తితోబాటు, నాన్నను చూడాలనే ఆరాటం ఎక్కువయింది. సెలవులిచ్చారు. పిల్లలంతా ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. నాన్న రాలేదు.

మా ఊళ్ళో ... ఊరి చివరన పొలాలమధ్యగా ఉన్న మా పెంకుటిల్లూ, ఇంటి కెదురుగా గలగలా పారుతున్న మునేరూ నా దృష్టిలో పదేపదే మెదులుతున్నాయి. హెడ్‌మిస్ట్రెస్‌తో చెప్పి వెళ్ళిపోవటానికే నిశ్చయించుకున్నాను. నా చిన్నపెట్టెలో నాకున్న కొద్ది బట్టలూ సర్దుకుని హెడ్‌మిస్ట్రెస్‌దగ్గిరికి వెళ్ళాను.

నన్ను చూస్తూనే ఆమె చేతిలో ఉన్న ఉత్తరం నా చేతిలో ఉంచారు మౌనంగా.

"విశాలకూ, మాకూ ఎటువంటి సంబంధ బాంధవ్యాలూ ఉండటం వాళ్ల పిన్నికి ఇష్టంలేదు. ఇలా వ్రాయటానికి బాధపడుతున్నప్పటికీ, విశాల క్షేమం ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను. అది ఎంతవరకూ చదువుకున్నా నాకు అభ్యంతరంలేదు. డబ్బు పంపటంవరకే నేను చేయగలిగిన సహాయం. ఇంత కంటె ఎక్కువ బాధ్యత తీసుకోలేకపోతున్నందుకు, నా చిట్టితల్లిని ఒంటరిదాన్ని చేస్తున్నందుకు అసమర్థుడయిన ఈ తండ్రి హృదయం ఎంత క్షోభిస్తూందో ఆ భగవంతుడికే తెలియాలి. నా బిడ్డకు తల్లీ, తండ్రీ మీరే. సెలవు."

ఉత్తరం చదవటం ముగిస్తూ అయోమయంగా చూశాను. నాన్న సంతకం. ఏం జరిగిందో తెలియని స్థితిలో అమాయకంగా నిలబడిపోయాను.

"విశాలా....ఇలా రా తల్లీ, బాధపడకమ్మా! కన్న తండ్రి అన్యాయం చేసినా, నీవు నా బిడ్డవి. వెళ్ళమ్మా. నీ గదికి వెళ్ళు. సెలవుల్లో చక్కగా చదువుకో." చెమ్మగిలిన కళ్ళతో, దగ్గిరికి తీసుకుంటూ అన్నారు హెడ్‌మిస్ట్రెస్ ఆదరంగా.

'నాన్న ఇంక కనిపించరు. అక్కడికి వెళ్ళే అర్హత నాకు లేదింక. నా కెవ్వరూ లేరు. నే నిక్కడే ఉండాలి.' అదే ఊహ నా మనసులో పనిచేస్తూంది.

"ఒక విధంగా నీ మంచికే జరిగింది. అక్కడికి వెళ్ళినా మీ పిన్ని నిన్ను ఆదరించలేదు. అక్కడనుంచి బయటపడ్డావు. చదువుకుని వృద్ధిలోకి రా తల్లీ!" కంఠం గద్గదమవుతుంటే గబగబ నడిచిపోతున్న హెడ్‌మిస్ట్రెస్‌వైపు నిస్సహాయంగా చూసి హాస్టల్ వేపు దారితీశాను. ఆ చిన్ని పెట్టెతో తిరిగి అదే గదిలో అడుగుపెడుతూంటే ఏదో తెలియని బాధ, నిస్పృహ, ఒంటరితనం నన్ను చుట్టుముట్టి దుఃఖం పెల్లుబికింది.

ఇకముందు నా స్థానం ఆ గదిలోనే. అమ్మా, నాన్నా



ఎవ్వరూ లేరు. పిన్నిని చూడగానే అమ్మలా నన్ను ఆదరిస్తుందనుకున్నాను. కానీ...

నాకా అదృష్టం లేదు. ప్రాణంగా చూసుకునే నాన్న ఇలా వదిలేస్తారనుకోలేదు,

మాఊరు ... నిద్రలేస్తూనే ఎదురుగా కనిపించే పచ్చని పొలాలూ, పొలాల వెనక గలగలా పారే మునేరూ, మునేటిలోనుంచి పైపైకి వస్తున్న ఎర్రని సూర్య బింబం నన్ను చూస్తూనే గోముగా దగ్గిరికి వచ్చే ఆవుదూడా, దొడ్లో ముచ్చటపడి నాటిన గోరింట మొక్కలూ, అన్నీ కళ్లముందు కదిలిపోతున్నాయి. వాటిని చూసుకునే అదృష్టం లేదింక నాకు. నా కక్కడ చోటు లేదు. నేను పరాయిదాన్ని. అనాథని. నా కెవ్వరూ లేరు.

గుండెలవిసేలా ఏడ్చాను. నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. ఆనాటినుంచీ స్కూలే సమస్తం నాకు.

స్కూలుకు వెళ్లటం, పాఠాలు చదువుకోవటంతో నా దినచర్య పూర్తి అయేది.

తోటి పిల్లలంతా ఆటలతో, పాటలతో, గంతులు వేస్తూ ఆడుతూఉంటే అలా వాళ్లని చూస్తూ దూరంగా ఉండిపోయేదాన్ని. ఒక్కసారి గంభీరంగా నిలుచున్న నాకేసి వింతగా చూసి వాళ్ళ ఆటలలో మునిగిపోయేవారు.

వాళ్ళకి అంత ఆనందం ఎక్కడిది? నే నలా ఎందు కుండలేకపోతున్నాను? ఏ సంకోచం నన్ను కట్టి పడేస్తూంది? వాళ్లందరిలో నే నొక్కదాన్నీ వెలిగా భావించుకుని నన్ను నేనే ఎందుకు కించపరుచుకుంటు న్నాను?!

'నాకు నా అనే వాళ్ళెవరూ లేరు. అనాథను. ఎవ్వరికీ పనికిరానిదాన్ని. వాళ్లతో స్నేహానికి తగను.' ఈ భావనే ఇన్నాళ్ళూ నన్ను మరీ ఒంటరిని చేసింది.

రోజులు దొర్లిపోతున్నాయి. స్కూలు జీవితం ఏ మార్పూ లేకుండానే ముగిసింది.

కాలేజీలో అడుగుపెట్టాను. హాస్టల్‌లో దిగ విడుస్తూ దగ్గిరికి తీసుకుని ఆప్యాయంగా తల నిము రుతూ అన్నారు హెడ్‌మిస్ట్రెస్. "క్లాసులన్నింటిలో ఫస్ట్‌గా వచ్చావు. ఇకముందుకూడా అలాగే చదవాలి, విశాలా. నీ తండ్రి ఈ ఒక్క విషయంలోనైనా నిన్ను కరుణించాడు. ఎంతదాకా చదవాలనిఉంటే అంత వరకూ చదువుకో. నా సహాయం నీ కెప్పుడూ ఉంటుంది."

ప్రేమతో ఆమె మనసు ఆర్ద్రమయింది. నమస్క రించటంతప్ప ఆమె కే విధంగా కృతజ్ఞత తెలుపు కోవాలో తెలియలేదు. ఆమెపట్ల గౌరవంతో, ఆత్మీ యతతో నా మనసు నిండిపోయింది.

పండుగలనీ, పరీక్షలనీ, ఉత్సవాలనీ ఎప్పుడూ ఏదో ఒక సందడి హాస్టల్లో. ఒక్కో సబ్జక్టే చదువుతూ ఉంటే ఇంకా ఇంకా చదవాలనిపించేది.

పుస్తకాలలో, పరీక్షలలో, తోటిపిల్లల నవ్వుల్లో, రాత్రిళ్ళు పట్టుదలగా చదివే చదువుల్లో రోజులు గడిచిపోతున్నాయి. తలఎత్తి చూస్తే కనిపించే విశ్వవిద్యాలయ భవనాలూ, భవనాలమీదుగా తేలి పోతూండే తెలిమబ్బులూ చూసినప్పుడల్లా, 'ఆ భవనాల్లో నే నెప్పుడు చదవగలుగుతాను? బీరువాలలో నిశ్శబ్దంగా నిద్రించే ఆ పుస్తకాలలో



ఎంతదైనా సరే...

ఫోటో—బాలు (మైసూరు-4)

నే నెప్పుడు జీవించగలుగుతాను?' అనిపించేది.

మూడు సంవత్సరాలూ ఇట్టే గడిచిపోయాయి. పేపర్లో నెంబరు వెతుక్కుంటూంటే "కంగ్రాట్యులేషన్స్, విశాలా" అన్నారు హెడ్‌మిస్ట్రెస్.

నంబరు వెతుక్కోడం హడావిడిలో ఆమె ఎప్పుడు వచ్చారో గమనించలేదు నేను.

"క్లాస్ వచ్చింది కాబట్టి లిటరేచర్ ఎమ్. ఎ. చదువు." గంభీరంగా ఉండే ఆమె ముఖం, నాపై ఉన్న అభిమానంతో వెలిగిపోతూంది.

"తప్పకుండా మేడమ్. ఎప్పటినించో నాకా కోరిక" అన్నాను ఉత్సాహంగా. విజిటింగ్ టయిమ్ అయిపోవటంతో మేడమ్ త్వరగా వెళ్ళిపోయారు.

ఆమెను చూస్తూ అలా ఎంతసేపో నిల్చుండిపోవటం నా కిప్పటికీ బాగా గుర్తు.

* * *

నా జీవనరంగంలో మొదటి అంకం పూర్తి అయింది ఆ విధంగా. యూనివర్సిటీలో చేరాను.

పుస్తకాలూ, లెక్చర్లూ, చదువులూ నన్ను పూర్తిగా ఆక్రమించుకున్నాయి. రోజులు నిమిషాల్లా గడిచిపోతున్నాయి. సరిగ్గా సారథి పరిచయం ఈ రోజుల్లోనే అయింది. ఆరోజు ... నాకు బాగా గుర్తు.

యూనివర్సిటీ లైబ్రరీలో పుస్తకాలకోసం వెతుక్కుంటున్నా.

"నమస్కారమండీ." నాపక్కనే అపరిచిత కంఠం వినిపించి ఉలిక్కిపడ్డాను. తలఎత్తి చూస్తే తెల్లని బట్టల్లో నీట్‌గా టక్ చేసుకుని నన్నే పరిశీలనగా చూస్తున్న వ్యక్తి. అతన్ని ఎక్కడో చూసినట్లు అనిపిస్తూంది.

"నన్ను సారథి అంటారు. ఇక్కడ సోషియాలజీలో రిసెర్చి చేస్తున్నాను" అన్నా డతనే.

"నమస్కారం" అన్నాను ముభావంగా.

"మీ క్లాస్‌మేట్ సరోజ నా కజిన్. మీ గురించి చాలా చెబుతూఉంటుంది."

"అలాగా" అన్నాను కనిపించని పుస్తకంకోసం వెతుక్కుంటూ. నాతో అతనికి ఏం పనో అర్థం కాలేదు.

"పుస్తకాలకోసం లైబ్రరీకి వచ్చాను. మీరు కనిపించారు. పరిచయం చేసుకోవాలనిపించి..."

అతని మాట పూర్తి కాకుండానే చుట్టూ చూశాను. నిశ్శబ్దంగా ఉన్న లైబ్రరీలో ఒకరిద్దరు మమ్మల్నే గమనిస్తున్నారు.

అత నలా అక్కడే మాట్లాడుతూఉండడం నాకిష్టం లేకపోయింది.

పుస్తకాలు తీసుకుని బయటికి నడుస్తూ అన్నాను. "థాంక్స్! కానీ మీరు పరిచయం చేసుకోవాలనుకునేంత గొప్పదనం ఏమీ లేదు నాలో."

"నన్ను గురించి మీరు మరోలా అనుకోకండి. మిమ్మల్ని చిలిపిగా అల్లరిపెట్టాలనుకునిమాత్రం పలకరించలేదు." నాపక్కనే మేడమెట్లు దిగుతూ అన్నా డతను.

"నో ... నో ... నేనలా అనుకోటంలేదు."

"ప్లీజ్ ... నాదొక కోరిక."

"ఏమిటి?"

"మీతో కొంచెం మాట్లాడాలి. ఎప్పుడు వీలవుతుందో చెప్పండి." చురుగ్గా చూశాను అతని వేపు. సారథి వదిలేలా లేడు. నాకు చిరాకనిపించింది.

"చూడండి, అనవసరమయిన పరిచయాలూ, చనువూ తీసుకోవటం నా కిష్టం ఉండదు. అలవాటు లేదు కూడా. నాతో మాట్లాడేందుకు ఏముంటుంది గనక? మీ రెవరోకూడా నాకు తెలియదు. వస్తా ..." అన్నాను బస్సెక్కుతూ.

కదిలిపోతున్న బస్సులోనుంచి అతని ముఖంలో నీలినీడలు స్పష్టంగా గమనించాను. విశాలమయిన అతని కళ్లల్లో ఏదో సహృదయత తొంగి చూస్తున్నా, అతనితో పరిచయం నా కిష్టం లేకపోయింది.

బహుశా దీనికి నా మనస్తత్త్వమే కారణమేమో! ఒంటరిగా గడిపే నా జీవితంలో ఇంతవరకూ నన్ని హితులెవరూ లేరు. అతన్ని గురించి నే నెక్కువగా ఆలోచించలేదు.

ఆఖరి సంవత్సరం. పరీక్షలు దగ్గిరికి వస్తున్నాయి. ఎంత చదివినా తరగని ఈ లిటరేచర్ నాకు అగమ్యగోచరంగా ఉంది. ఏరికోరి తీసుకున్నందుకు పేపర్స్ బాగా ఆన్సర్ చేయగలుగుతానో లేదోననే భయం నన్ను వెంటాడుతూంది.

సాయంకాలపు నీరెండ చెట్లసందుల్లోనుంచి గోడమీద అందమైన అలంకారంలా పడుతూంది.

చేతిలో పుస్తకం పట్టుకుని ఆలోచిస్తూ కూర్చుండిపోయిన నా చేతికి చీటీ తెచ్చి ఇచ్చింది ఆయా విజిటరు ఎవరో వచ్చినట్లు.

తలుపు చేరవేసి వచ్చాను. విజిటర్స్ రూమ్ నిశ్శబ్దంగా ఉంది, అక్కడా అక్కడా చెదురుగా బల్లల దగ్గిర కూర్చున్న కొద్దిమంది సందడితప్ప.

అత నక్కడ కుర్చీలో కూర్చున్నాడు. సారథి! నా ఆశ్చర్యానికి అంతులేదు.

"నమస్తే" అన్నా డతను నన్ను చూస్తూనే. "నే నెవరో జ్ఞాపకం ఉందనుకుంటాను. రెండు నెలలక్రితం లైబ్రరీలో కలుసుకున్నాను" అన్నా డతనే.

విశాలమయిన అతని కళ్లల్లో సిగ్గుతోకూడిన మరేదో భావం నా మనస్సుని స్పృశించినట్లయింది.

"ఔను. జ్ఞాపకం ఉన్నారు" అన్నాను ఆలోచనగా.

ఈ మధ్యకాలంలో రాత్రిళ్ళు చదివి చదివి అలసటగా మంచంమీద వాలినప్పుడూ, వాలుకుర్చీలో ఒదుగుని కిటికీలోనుంచి దూరంగా చూస్తూ మత్తుగా ఆలోచిస్తున్నప్పుడూ తెల్లని బట్టల్లో నీట్‌గా టక్ చేసుకున్న అతని రూపం అప్రయత్నంగా నా మనసులో మెదలకపోలేదు.

"ఈ మధ్యలో మిమ్మల్ని చూడాలని చాలా అనుకున్నాను. కానీ..." సందేహంగా సగంలోనే ఆపి నా కళ్లల్లోకి చూశా డతను. అతని చూపులు నా హృదయంలో ఎక్కడో లీలగా స్పృశించినట్లయింది. వింత అనుభూతి మెల్లిమెల్లిగా నన్నావరిస్తూంది.

"పర్మిషన్ తీసుకుని వస్తారా? ఒక్కసారి బీచ్‌కేసి వెళ్ళివద్దాం. మీతో మాట్లాడాలి." అతనే అన్నాడు మళ్లీ.

"ఇక్కడే చెప్పండి. నాకు పనుంది." నా కంఠంలోని విసుగుదల నాకే ఆశ్చర్యం కలిగించింది.

పెద్దగా నిట్టూరుస్తూ అన్నా డతను. "చెప్పండి, నేనంటే ఇలాంటి అయిష్టం ఎందుకు ఏర్పడింది మీకు? నాలో ఏలోపం చూశారు? మీతో ఆత్మీయత పెంచుకోవాలనీ, జీవితాన్ని పంచుకోవాలనీ అనిపించటం తప్పంటారా? క్షమించండి, ఇలా అడగటానికి సాహసించినందుకు." నిశ్చలంగా నన్నే చూస్తూ అన్నాడతను జవాబుకోసం నిరీక్షిస్తూ.

ఎలా చెప్పాలో నాకు తోచలేదు. అప్రయత్నంగానే జవాబిచ్చాను.

"మీకు ఒకసారి చెబితే అర్థం అవుతుందనుకుంటాను. మీరంటే అయిష్టమో, కాదో నాకే తెలియదు. నేను పెద్దగా ఏమీ ఆలోచించలేదు కూడా దీన్ని గురించి. ఇలాంటి పరిచయాలు నా కిష్టం ఉండవు. ఎవరి హద్దుల్లో వారు ఉండటం మంచిదని నా అభిప్రాయం. ఇలా మాటిమాటికీ నన్ను కలుసుకోవాలనిమాత్రం ఇంకెప్పుడూ ప్రయత్నించకండి. అనవసరంగా నలుగురి నోళ్లల్లో నానటం నాకు ఇష్టం ఉండదు. సో సారీ ... నాకు పని ఉంది. సెలవ్!" లేచి నిలుచున్నాను. లోపలికి వెళ్లిపోవాలనిపించింది.

అతను తలవంచుకుని కూర్చున్నాడు. మనసు కష్టపెట్టుకున్నాడేమోననిపించి వెళ్లలేకపోయాను. అతనివైపు చూడటానికి ధైర్యం చాలలేదు. కఠినంగా మాట్లాడానేమోననిపించింది. అత నలా కూర్చునేఉన్నాడు. నేను నా గదికి వెళ్లిపోయి కిటికీలోనుంచి బయటికి చూస్తూ ఉండిపోయాను.

కనుచూపుమేరలో అనంతంగా కనిపిస్తున్న సముద్రం. ఉరకలు వేసుకుంటూ వస్తున్న కెరటాలు ఒడ్డును తాకి తెల్లని నురగ వెండిపువ్వులా విరజిమ్మి వెనక్కి జరజర పాకిపోతున్నాయి. చల్లని గాలికి నా కళ్లల్లో నీరు కమ్మింది.

'నేను తప్పు చేశానా? తొందరపడి అలా అనవలసిందికాదేమో! అతను తప్పుమాట ఏమన్నాడు? స్త్రీ నయినంతమాత్రాన స్నేహాన్ని వాంఛించటం తప్పా? నాతో జీవితాన్ని పంచుకోవాలని ఉందన్నాడు! ఆ మాట సూటిగా తగిలిం దెందుకని? అలా అనటంలో తప్పేముందని? విశాలమయిన అతని కళ్లల్లో వెతికినా నేనంటే నీచభావం కనిపించటంలేదే? ఇంతవరకూ నేను పొందలేని మాధుర్యం ఏదో స్పృశిస్తూంది ఆ చూపులనుంచి. ఎందుకలా అన్నాను?' ఇవే ప్రశ్నలు

అనుక్షణం వేధించేది నన్ను.

ఆరోజు తరవాత నా [illegible] నా స్వాధీనంలో లేక పోయింది. అంతర్గతంగా నాలో దాగిన ప్రేమ కట్టలు తెంచుకుని ఉద్ధృతంగా పొంగి పొరలసాగింది.

మళ్ళీ అతను కనిపిస్తే క్షమాపణ కోరుకోవాలని తహతహలాడాను. రోజులూ వారాలూ గడుస్తున్నాయి.

సారథి కనిపించలేదు. వాళ్ళ డిపార్టుమెంటుకు వెళ్ళి కలుసుకోవాలనిపించినా ధైర్యం చాలటంలేదు.

జీవితంలో ఎప్పుడూ ఎదురుచూడని వ్యక్తి నా మనస్సు ఇంతగా ఆక్రమించుకుంటున్నాడనేది ఇప్పు డిప్పుడే తెలుస్తోంది. అతనికోసం నా హృదయం ఆరాటపడటం నాకు వింతనిపించేది. జీవితంలో కొత్త అనుభూతి ఇది!

అతని చూపులు, ఆనాటి అతని మాటలు, ఆ చిరు నవ్వు అనుక్షణం నా మనస్సు తాకుతున్నాయి పచ్చి.

నా కళ్ళు అతనికోసం వెదికేవి. అతనేనేమో అను కున్నప్పుడల్లా నా గుండె దడదడలాడేది.

పుస్తకాలలో దూరి అతన్ని మరవటానికి వృథా ప్రయత్నం చేస్తున్నాను.

ఆరోజు ... సాంవత్సరికోత్సవం విశ్వవిద్యాలయంలో. జూబిలీహాల్‌దగ్గర అనుకోకుండా సారథి కనిపించాడు. నా గుండె ఝల్లుమంది. క్షణంసేపు నా చూపులతో చూపులు కలిపిన సారథి తలవంచుకుని పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు అక్కడినుంచి.

బాధ సూదిమొనలా గుచ్చుకుంది. అతన్ని పిలవాలని ఆత్రంగా రెండడుగులు ముందుకు వేసినదాన్ని అక్కడే నిల్చుండిపోయాను ప్రతిమలా.

నాకు తెలుసు. అతని చూపుల్లోని వ్యథ నాకర్థ మయింది. నా మూలంగానే అతను దూరంగా వెళ్ళి పోయాడు. నా మనసు విలవిల్లాడింది. మిగిలిన రోజంతా ఆవేదనగా గడిపివేశాను.

పుస్తకాలు విసుగ్గా టేబిల్‌మీద పడేసి పడక కుర్చీలో వాలిపోయి అతనితో నా పరిచయాన్ని, నా హృదయాన్ని ఆవరించుకున్న తీయని బాధనూ చర్విత చర్వణం చేసుకుంటూఉంటే రోజులు గడిచి పోతున్నాయి. ఆ బాధ ఎంత తీయగా ఉండేదనీ! ఆలోచించినకొద్దీ ఇంకా ఆలోచించాలనే పిచ్చి ఆకాంక్ష. నిర్వచించలేని మధురానుభూతి నన్ను ఆలుముకునేది.

సారథికి ఇదంతా చెప్పాలి. ఎలా? మొదటినుంచీ ఏ అజ్ఞాతశక్తి నన్ను అడ్డుకుంటూందో అదే ఈసారీ నన్ను మోసగించింది.

క్లాసునుంచి వెళ్ళిపోతూ మెట్లు దిగుతూఉండగానో, బస్సు కదులుతూఉంటే కిటికీలోనుంచి బయటికి చూసినప్పుడో దూరంగా మలుపు తిరుగుతూ కని పించేవా డతను.

నా చిన్న పొరపాటుకు ఇంతగా శిక్షిస్తాడనుకోలేదు. నా బాధ, నా కోరిక నా గుండెల్లోనే ఉండిపోయింది.

పరీక్షలయిపోతున్నాయి. ఇకముందు ఏం చెయ్యాలి? ఈ ఒంటరితనం ఎన్నాళ్ళు? ఎలా గడపటం? ప్రశ్నలు ఎదుర్కొంటూంటే నిస్సహాయంగా ఉండి పోయాను. పేరుకుపోయిన చీకటిలాంటి నా ఒంటరి జీవితంలో సారథి ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. అయా చితంగా లభించిన ఈ వెలుగును పోగొట్టుకుని నేను బ్రతకలేననిపిస్తోంది.

అతను ఈనాటికీ నాకు అర్థంకాని వ్యక్తిగానే ఉండి పోయాడు. అతని [illegible] నన్ను దహిస్తున్నది. నాలోని [illegible] అంతకంతకూ. దాన్ని భరించలేక, బయటికి వ్యక్తంచేయలేక నిప్పులాగా ఎక్కడికో పారిపోవాలనిపిస్తోంది.

పేపర్లు బాగా ఆన్సర్ చేశానన్న ఆనందంతో కదులుతున్న బస్సులో పరిగెత్తుకుంటూ వచ్చిపడ్డాను.

ఎదురుగా సారథి! నా గుండె దడదడలాడింది. అతను నన్నే చూస్తున్నాడు. మనసు కంపించింది. మాట్లాడాలని ప్రయత్నించాను. మనసు మూగబోయి కంఠం పెగిలి రాలేదు. చూపుల్లో చూపులు కలపాలని పించింది. సిగ్గుతో బరువుగా కిందికి వాలిన కను రెప్పలు పైకి లేవలేదు. కిటికీలోనుంచి బయటికి చూస్తూ ఉండిపోయాను. నా నవనాడులూ నిస్సత్తు వతో కుంగిపోయాయి. బహుశా ప్రేమ నా హృద యాన్ని ఆవరిస్తున్న సమయం అనుకుంటాను ఇది. అందుకే ఆ కంపరం. వణుకుతున్న క్రింది పెదవిని పంటికింద నొక్కిపెట్టాను. బస్సు ఆగింది. తల తిప్పి చూశాను. అతను దిగి వెళ్ళిపోతున్నాడు.

భరించలేని ఆవేదనతో నా హృదయం ఆక్రో శిస్తోంది. ఈసారికూడా అవకాశాన్ని జారవిడుచు కున్నాను. నా ఊహలూ, నా ఆశలూ నా వరకే పరి మితం అవుతున్నాయి. నాలోని ఏ శక్తి ఇలా అడ్డు కుంటూందో తెలియదు. అతనితో ఏమీ చెప్పలేక పోయాను.

సెలవు లిచ్చారు. సారథి రూపాన్ని మౌనంగా ఆరా ధిస్తూ గడుపుతున్నాను. కలుసుకోవాలనీ, నా హృద యాన్ని అతనిముందు పరవాలనీ ఆరాటం అయితే ఉంది. వ్యక్తంచేయలేకపోతున్నాను.

అతని ప్రేమతో నా బ్రతుకు నింపుకోవాలి. నా జీవితాన్ని అతనితో పంచుకోవాలి. విశాలంగా ఉన్న ఆ కంటిరెప్పల నీడలో నిశ్చింతగా విశ్రమించాలి. కోరికలతో ఊహాసౌధాలు నిర్మించుకుంటున్నా...

ఆరోజు... పోస్టుమేన్ కేక నా కలల్ని చెదరగొట్టింది. ఉలికిపాటుతో అందుకున్నాను. సారథి ఉత్తరం! నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. విప్పకుండా అలా ఎంతసేపో చూస్తూ ఉండిపోయాను. వణుకుతున్న నా చేతులు సారథి ఉత్తరాన్ని నా కళ్ళముందు ఉంచాయి.

"విశాలగారూ,

ఈ ఉత్తరం మీ చేతుల్లో ఉండేవేళకు నేను మీకు చాలా దూరంగా వెళ్ళిపోతున్నా. నేనంటే మీకు ఏర్పడిన అసహ్యాన్ని పక్కకు నెట్టి కనీసం నా ఈ ఉత్తరాన్నయినా పూర్తిగా చదవాలని ఆఖరిసారిగా ప్రార్థిస్తున్నా.

ఒకొక్కవ్యక్తిని చూడగానే ఎందుకు మమకారం ఏర్పడుతుందో, ఒకొక్కవ్యక్తిని చూడగానే ఎందుకు అసహ్యించుకుంటామో తెలియకుండా జరిగిపోతుంది అప్పుడప్పుడు. మీరంటే అవ్యక్తమయిన అనురాగం, మమకారం పెంచుకోటమే నా హృదయం చేసిన అపరాధం అయితే నన్ను క్షమించండి. మీకు దగ్గిరగా రావాలని ఎంతో ప్రయత్నించాను. నా దురదృష్టం కొద్దీ దూరంగానే ఉండిపోయారు. జీవితంలో చెరగని ముద్రలుగా నిల్చిపోయిన కొన్ని రూపాల్ని బలవంతంగా చెరుపుకోవడంకూడా ఆవశ్యకం ఒక్కొక్కప్పుడు. అందుకే ఈ ప్రయత్నం.

పిహెచ్. డి. అయి, రీడర్‌గా ఒక ఉత్తరాది యూనివర్సిటీకి వెళ్ళిపోతున్నాను. రెండురోజుల్లో,



మూడు కోతులూ ఒక తోకా

ఫోటో—బాలు (మైసూర్—4)

నాన్నగారు స్థిరపరిచిన శ్యామలతో వివాహం జరుగు తూంది. ఆఖరిసారిగా చూడాలనిపించి మీ రూమ్‌కి నాలుగురోజులక్రితం వచ్చాను. తాళం వేసి ఉంది.

సెలవ్.

సారథి."

చెంపలమీదినుంచి జారిన కన్నీటితో అలుక్కుపోతూ ఉన్నాయి అక్షరాలు. 'నన్ను అపార్థం చేసుకున్నావ్ సారథీ!' అంటూ మనసు ఘోషపెడుతూంది. నే నేం చేశాను? ఎందుకిలా జరిగింది? అణువణువూ అతని కోసమే తపిస్తూందే, అనుక్షణం అతన్నే ఆరాధిస్తు న్నానే? ఎందుకిలా వెళ్ళిపోయాడు? అతన్ని అసహ్యించు కున్నానని ఎలా అనుకున్నాడు?


బాధతో నాగుండె బరువెక్కుతూంది. ఏక్షణంలో నయినా బద్దలవుతుందేమోననిపిస్తోంది. అతన్ని నేనే పోగొట్టుకున్నానా? మనసులోమాట బయటకు చెప్పలేకపోయానెందుకని? ఇంకెలా బ్రతకను? ఈ శూన్యాన్ని ఎలా భరించను?

ఒక్కసారిగా నా ఊహాసౌధం కూలిపోయింది. అతని ఉత్తరం నా హృదయాన్ని గాయపరిచింది. నా జీవితంలో పరాజయం లభించడం ఇది రెండవ సారి.

సారథి రూపాన్ని మనసులో నింపుకుంటూ భవిష్యత్తులోని తీయని దాంపత్యాన్ని తలుచుకుంటూ ఇన్నాళ్ళూ ఆశగా గడిపాను. కలలు కన్నాను. జీవితంలో కొత్త అనుభూతికోసం, కొత్త ఆనందం కోసం అన్వే షించాను. ఆశతో చాచిన నా చేతికి శూన్యమే చిక్కింది. నా జీవితం భయంకరమయిన శూన్యమే అయింది. దారుణమైన ఈ విషాదానికి అంతంలేదు.

ఈ గుండెకోత నేను భరించలేను. నా కిక ఏ ఆశా లేదు. అతను వెళ్ళిపోయాడు. నా జీవితాన్నించే నిష్క్రమించాడు. నన్ను అపార్థం చేసుకున్నాడు. మా ఇద్దరిమధ్యా ఎన్నటికీ దగ్గరకాని దూరం.

ఒక్కసారి . . . ఇంకొక్కసారి పలకరించి ఉంటే ఈ దారుణం జరక్కపోను. రెండు సంవత్సరాల ఈ స్మృతులే నాకు మిగిలినవి. వీటిని తలుచుకోలేను.




తలుచుకోకుండా ఉండలేను.

నీలాకాశపు సౌందర్యాన్ని చూడాలని తహతహ లాడుతూ రేకుల్ని విప్పుకుంది నా చిన్నారి హృదయ కుసుమం. ఒకే ఒక్కక్షణం ఆలస్యం అయింది. కళ్లముందు నిల్చింది ఆకాశపు నీలిమకాదు. ఆవరించుకున్న కారుమబ్బులు.

నా కళ్లల్లో తడి ఆరిపోయింది. నన్నెవరూ ఓదార్చరు. నాకెవరూ లేరు. నేను అనాథను!

హృదయంలో వికసించిన ఈ ప్రణయకుసుమాన్ని ఆనాడే అతనికి కానుకగా ఇచ్చిఉంటే నా జీవితం ఇంకోలా మలుపు తిరిగి ఉండేది. ఇప్పుడతను పరాయివాడు. ఈ భావన నన్ను క్రుంగదీస్తూంది. భయంకరమయిన ఈ ఒంటరితనం నన్ను మరీ భయపెడుతూంది.

జీవితంపట్ల కోరిక నశించిపోతూంది. ఇది నా జీవిత చరమాంకం. నా జీవన అధ్యాయంలోని చివరి పేజీ ఇలా విషాదంగా ముగించవలసి వస్తుందనుకోలేదు.

దూరంగా వినిపించే మృత్యుదేవత అడుగుల కోసం నిరీక్షిస్తూ రోజులు గడుపుతున్నాను. గాఢాంధకారంలోని శూన్యాన్ని చూస్తూ విషాద గీతిక పాడుకుంటూ ఉంటాను. ఆ శూన్యంలోనుంచి ఎప్పుడో ఆ మృత్యుదేవత వచ్చి నన్ను కరుణించకపోదు. ఇదే నాఆశ.

ఈ సమస్య పాప నా జీవితంలో ప్రవేశించేదాకా అలాగే ఉండిపోయింది. అప్పటికిగాని పరిష్కారం లభించలేదు.

● ● ● ●

ఆరోజు......

చీకట్లు వీడిపోలేదింకా. గాఢంగా పట్టిన నిద్రలోనుంచి కలతగా లేచాను. చలిగాలి జివ్వుమంటూంది. ఎక్కడో పసిపిల్ల ఏడుపు వినిపిస్తూంది. దుప్పటీ ముసుగు పైకి లాక్కుని పడుకున్నాను.

ఈసారి పాప ఏడుపు బయటి వరండాలోనుంచి వినిపిస్తూంది. లైటువేసి తలుపు తెరిచాను. ఎదురుగా నేలమీద పొరాడుతున్న రెండేళ్ల పాప! ఆశ్చర్యంగా ఉంది! ఎవరీపాప! ఎలా వచ్చింది? వర్షానికి తడిసి ఎవరైనా ఈ వరండాలో తలదాచుకున్నారేమో వాళ్ల పాపే అయిఉంటుంది!

వరండాలో లైటు వేశాను. శూన్యంగా ఉంది వరండా. ఎవ్వరూలేరు. నా ఆశ్చర్యం అవధులు దాటింది. గుక్కపట్టి ఏడుస్తున్న పాపని చేతుల్లోకి తీసుకుని ఊరడిస్తూ చుట్టూ చూశాను అనుమానంగా. కిటికీలో గాలికి ఎగిరిపోకుండా రాతికింద పెట్టిన ఏదో ఉత్తరం. ఆత్రంగా విప్పి చూశాను.

"అమ్మా, విశాలా,

ఈ పాప ఎవరో అనుకోకు! స్వయంగా నీ తండ్రి రక్తాన్ని పంచుకుని పుట్టినబిడ్డ. ఈ బిడ్డను కని శాశ్వతంగా కళ్లు మూసింది మీ పిన్ని. నిన్ను అన్యాయం చేసినందుకు భగవంతుడు నా కిచ్చిన శిక్షయిది. ఈ పసికందుని రెండేళ్లుగా ఎలా పెంచానో దైవానికే తెలియాలి. భయంకరమైన క్షయవ్యాధి పట్టుకుంది నన్ను. ఇక ఎంతోకాలం బ్రతకను. ఈ పరిస్థితుల్లో ఈ పసికందును పెంచలేకా, ఒంటరిగా వదలలేకా నీకు అప్పజెప్పుతున్నాను. అభాగ్యురాలయిన

మీ పిన్నినీ, కఠిన హృదయుడయిన నీ తండ్రినీ మనసులోనుంచి తుడిచి వేసుకుని అనాథ బాలికగా నయినా దయతలిచి ఈ పాపని పెంచుతావని నా ఆశ.

ఈ విధంగా నీ జీవితంలో అడ్డు రావడానికి సంకోచంతో వ్యథ చెందుతున్నప్పటికీ గత్యంతరంలేక ఈ బాధ్యత నీకు వదులుతున్నాను. ఆస్తి, ఇల్లు, మీ ఇద్దరిపేర వ్రాశాను. నాకోసం వెతకవద్దు. దుఃఖ పూరితమైన ఈ జీవితంలో మిగిలిన ఈ నాలుగు ఘడియలూ భగవంతుని సన్నిధానంలో గడుపుతాను.

నీ తండ్రి అని చెప్పుకోటానికి తగని
అభాగ్యుడు."

"నాన్నా" అప్రయత్నంగా గట్టిగా అరిచాను. నా కళ్ళు ప్రవాహాలయినాయి. అంతర్గతంగా నాలో దాగిన మమకారం పొంగిపోతూంది. ఎప్పటినుంచో ఏడ్చి ఏడ్చి అలసిపోయిన పాప భుజంమీదే నిద్ర పోయింది. పక్కమీద పడుకోబెట్టి వీధిలోకి పరిగెత్తాను. రోడ్డు నిశ్శబ్దంగా, నిర్జనంగా ఉంది. సముద్రపుఘోష వినిపిస్తూంది దూరంగా. బరువెక్కిన గుండెతో లోపలికి అడుగుపెట్టాను.

అమాయకంగా నిద్రపోతూంది పాప. కన్నీరు బుగ్గలమీద చారికలు కట్టింది. నిద్రలో కూడా వెక్కుతూంది. పాపని చూస్తున్న కొద్దీ నాగుండె తరుక్కుపోతూంది. పిన్ని నన్ను అనాథని చేసేరోజున తనపాప భవిష్యత్తు ఇలాగే అవుతుందని ఊహించిఉండదు. పాప భవిష్యత్తును గురించి ఎన్నో కలలు కనిఉంటుంది. కానీ....అభాగ్యురాలు. అదీ నాలాగే ఏకాకిని అయింది. అందుకే మా ఇద్దరినీ జత పరిచాడు దైవం. పాపను ఇక్కడ విడిచేముందు నాన్న ఎంత ఆరాటపడి ఉంటారో తలుచుకుంటే ఆయనపై వెర్రిమమకారం సుడులు తిరగసాగింది నాలో. దీనుడిలా అలా ఎందుకు వెళ్లిపోయారు ఆయన? నా అనేవాళ్ళులేని నా గుండె ఆత్మీయత కోసం, ఆప్యాయత కోసం ఎంత అలమటించి పోతూందో ఆయన ఊహించి ఉండరు.

నిద్రలో కదిలింది పాప. చిచ్చికొడుతూ పక్కనే పడుకున్నాను. ఈ పాపకి తల్లినవాలి ఇకముందు. ఒక విధంగా దైవమే నన్నిలా కరుణిస్తున్నాడు. ఒంటరిగా అలమటించి పోతున్న నాగుండెల్లో ఎప్పటికప్పుడు ఏదో ఒక మమకారాన్ని నింపుతున్నాడు.

'గత జీవితానికి తెరవేసి పాపకి తల్లిగా జీవించాలి. శూన్యంలో గుడ్డిదానిలా వెతుక్కుంటున్న నాకు పాపని ప్రసాదించింది మృత్యుదేవత. నేను జీవిస్తాను నా పాప కోసం. ఇదే నా జీవన లక్ష్యం ఇకముందు. భగ్నమైన నా ఆశలూ, ఆశయాలూ, కోరికలూ, అన్నీ పాపలో చూసుకుంటాను. ఈ ఒంటరితనం, ఈ వ్యథా, ఏవీ పాపకి సోకనివ్వను.' ఇలా నిశ్చయించుకున్నాక నా మనసు తేలికపడింది. పాపని గుండెలకు హత్తుకున్నాను. చలికి గుండెల్లో దూరి పడుకుంది పాప. అప్రయత్నంగా నా కళ్ళముందు నిల్చాడు సారథి. కన్నీటితో పాప తల తడిసిపోతూంది. "పగిలినబొమ్మ కోసం దుఃఖించటం అవివేకం. గతంలోని విషాదాన్ని తలుచుకుంటే వచ్చేవి విషాదాశ్రువులే. ఆనందాశ్రువులు కావు. మనసు గట్టి పరుచుకోవాలి." నన్ను నేనే ఓదార్చుకున్నాను. ధైర్యం చెప్పుకున్నాను. కన్నీరు తుడుచుకుని భవిష్యత్తులోనికి తొంగి చూశాను. భవిష్యత్తు విచిత్రంగా నవజీవనంతో నాకళ్ళముందు నిలిచింది. చైతన్యం కదిలింది. మోడు చిగిర్చింది. మనసు చల్లనిగాలి చవి చూచింది.

* * *

పాపను చదువుకోసం ఇంతదూరం పంపటం నాకిష్టంలేదు. అయినా తప్పలేదు. వాతావరణం మార్పుతో నన్నా పాప నాది అవుతుందనే భ్రమ నన్ను వదలటంలేదు. కదిలిపోతున్న రైలుబండిని ఆవేదనగా చూస్తూ నిల్చుండిపోయాను. పాప వెళ్ళిపోయింది.

ఇంటికి వచ్చి అలసటగా వాలు కుర్చీలో వాలాను. ఈ పద్నాలుగేళ్ళ జీవితం విద్యార్థులకు ఉపాధ్యాయినిగా, పాపకు తల్లిగా నన్ను పెద్దదాన్ని చేసింది. బాధ్యతాయుతమైన పాప పెంపకంలో అనుక్షణం నన్ను వెంటాడిన సమస్య నా కళ్ళముందు నిల్చింది.

తెగిపోయిన నా హృదయవీణాతంత్రులను శ్రుతి చేసింది పాప. సారథి నిష్క్రమణలో కృశించి పోయిన నా జీవితం ఈ కొత్త అనుభూతితో ప్రాణం పోసుకుంది.

తెలిసి తెలియని వయస్సులో ఎప్పుడో అమ్మ చూపిన ఆప్యాయత, అనురాగం నాకు చిరస్మరణీయాలు. అవి దృష్టిలో పెట్టుకుని పాపని పెంచటంలో నా సర్వస్వాన్ని ధారపోయాలనుకున్నాను. 'జీవితంలో తల్లినికాలేని నేను పాపకు తల్లిగా ఎంత వరకూ నా బాధ్యతను నెరవేర్చగలను?' అన్న శంక నిత్యం పీడించేది.

చిలిపిదనం చిందే పాప చిరునవ్వుకు తన్మయత చెందినా, దీనంగా ఏడుస్తున్న పాప ఏడ్పు అప్రయత్నంగా పిన్నిని జ్ఞప్తికి తెచ్చి మనస్సును కలవర పరిచేది.

ఎనిమిదేళ్ళ పాప కామిక్సు కోసం పేచీ పెడుతుంటే సంతోషంగా కొనేదాన్ని. కాలేజీనుంచి ఇంటికి రాగానే కాళ్లకు చుట్టుకుపోతున్న పాపను చేతుల్లోకి తీసుకుంటూ కంటికి రెప్పలా చూసుకున్నాను.

రోజులు గడిచిపోతున్నాయి. "అమ్మా, నువ్వు నిజంగా మా అమ్మవి కావూ?" అంది పాప ఆరోజు దూరంగా నిల్చునే.

పిడుగుపాటులా ఉలికి పడ్డాను. ఆ చిన్నమనసులో గతజీవితపు అపశ్రుతులు తొంగి చూడటం నేను సహించలేనిది. పాప జీవితం సుఖస్రవంతిలా సాగాలి. కానీ....ఇదేమిటి....ఇలా ప్రశ్నిస్తూంది?

"ఎవరన్నారు పాపా?" ముఖంలోకి సాధ్యమయినంత సహజత్వం తెచ్చుకుంటూ అన్నాను.

"సుశీల అంటూంది. వాళ్ళ అమ్మలాగా కాదుట నువ్వు నాకు. ఎక్కడో దొరికేనుట. దానికి వాళ్ళ అమ్మ చెప్పిందట." నా కళ్ళల్లో ఏదో వెతుక్కుంటున్నదానిలా చూస్తూ అంది పాప.

"అన్నీ అబద్ధాలు తల్లీ, సుశీతో స్నేహం చెయ్యకింక. నేను నీకు అమ్మనే!" గుండెకు హత్తుకుంటూ అన్నాను.

"మరి అయితే మా నాన్న ఏరీ? సుశీకి వాళ్ళ నాన్న ఉన్నారుగా?"

నా గుండె ఆగినట్టయింది. ఈ పసిమనసుని ఎలా సమాధానపరచాలో అర్థంకాలేదు. ఏమని చెప్పను? ఎలా?

"మీనాన్న చనిపోయారు పాపా!" బలవంతాన తెచ్చుకున్న మాటలివి. పాప మౌనంగా ఏదో ఆలోచనలో పడిపోయింది. "ఆడుకోమ్మా! వెళ్ళు."

పాపని పంపించానే కానీ నా మనసులో తుఫాన్ రేగింది. పాప జీవితాన్ని గతం స్పృశించకుండా ఉండాలని నేనెంత జాగ్రత్తపడినా ఈ నిజం దాగదేమోననే భావన నన్ను బాధ పెడుతూంది. ఏ భావన నన్ను జీవితాన్నించి ముంచిందో అదే భావన పాప జీవితాన్ని కమ్ముకోవటం నాకిష్టంలేదు.

నేను భయపడినంతా జరిగింది. పాపలో ఏదో మార్పు నన్ను కలత పెట్టసాగింది. మునుపటి ఉత్సాహం, ఆనందం ముఖంలో మాయమయ్యాయి. నిర్లిప్తంగా ఎప్పుడూ ఆలోచనామగ్నంగా ఉండే పదమూడేళ్ల పాప వయస్సుకి మించిన గాంభీర్యంతో కనిపించేది. పాప నాకు దూరమయిపోతూందన్న భావన నన్ను ఆరాటపెడుతూంది.

పరిష్కరించలేని సమస్యగా తయారయిన పాపని గురించిన ఆందోళన నా కళ్లకు నిద్రను దూరం చేసింది.

పాప గదిలోకి తొంగి చూశాను. లైటు వెలుగుతూంది. కుర్చీలో వెనక్కి వాలి నిద్రపోతున్న పాప మూర్తీభవించిన దీనత్వంలా ఉంది. దగ్గిరికి వెళ్ళి చూశాను. బుగ్గలమీద కన్నీటిచారికలు. నా గుండె తరుక్కుపోయింది. చేతిలో పుస్తకం తీసుకుని చూశాను. దాని పుట్టిన రోజున నేను బహుమతిగా ఇచ్చిన డైరీ పేజీలు తిప్పాను.

—"అమ్మ నాకోసం బాధపడుతూందని తెలుసు. అయినా మా ఇద్దరిమధ్యా ఉన్న ఈ సంకోచాన్ని దూరం చెయ్యలేకపోతున్నాను. ఆవిడ మా అమ్మకాదు. నన్ను దయతలిచి పెంచుతూంది. ఆవిడకు నేను ఏమీకాను. అవును. ఎవరికీ ఏమీకాను. నాకు ఎవ్వరూలేరు."


నా చేతులు వణకసాగాయి. గుండె చిక్కబట్టుకుని ఆత్రంగా వెనక పేజీలు తిప్పాను. "— సుశీ వాళ్ళ అమ్మ మెడచుట్టూ చేతులు వేసినప్పుడూ, సుశీని ఆమె దగ్గిరికి లాక్కున్నప్పుడూ నేను పొందలేనిదేదో వారి ముఖాల్లో కనిపిస్తుందేం? ఏమిటది?"

"— ఈరోజు అమ్మ ఒడిలో తలదూర్చి ఆమె ముఖంకేసి చూస్తూ పడుకున్నాను. సుశీ, వాళ్ళ అమ్మగారూ జ్ఞాపకం వచ్చారు. మా అమ్మని చూస్తే నాకెందుకు అలా అనిపించటంలేదూ? అమ్మ కూడా ఏమీ జరగనట్టు పుస్తకం చదువుకుంటుందేం? అలా నాకెప్పుడయినా దొరుకుతుందా ఆ అనుభూతి? సుశీ వాళ్ళఅమ్మలాగా మా అమ్మ నా ముఖంలోకి చూడదేం? చూసినా అలా ఉండదేం?"

"నా కెందుకనో ఉత్సాహంగా ఉండటంలేదు. ఏదో ఒంటరితనం నన్ను చుట్టుకుంటూంది. అమ్మ నన్ను కన్నతల్లి కాదని సుశీ అమ్మగారు చెప్పినప్పటి నుంచీ అమ్మ దగ్గిరికి వెళ్ళాలంటే ఎలాగో ఉంటూంది. అనాథనని దయతలిచి పెంచుతూంది అమ్మ నన్ను. అంతకన్న ఇంకేమీకాను ఆమెకు నేను. నాకెవ్వరూ లేరు....."

నా గుండెను ఎవరో నొక్కేస్తున్నట్లయింది. ఇక చదవలేకపోయాను. పుస్తకం అక్కడే పడేసి మౌనంగా ఇవతలికి వచ్చాను.

పాప భవిష్యత్తులో ఏ సమస్య తలెత్త కూడదనుకున్నానో అదే ఎదురయింది. నేనేం ఇవ్వలేకపోయాను? పాప నా దగ్గిర పొందలేకపోయిందేమిటి? తన సుఖమే నా సుఖం అనుకుని నా దృష్టినంతటినీ తనమీదే కేంద్రీకరించుకుని కంటికి రెప్పలా చూసుకున్నానే? ఇంకా నేను ఇవ్వలేక పోయిందేమిటి? ఏమిటా అను




భూతి? ......? ......?

• • • •

ఆనాటి ఆ ప్రశ్నకు ఈనాడు సమాధానం దొరికింది. అదే పాప ఉత్తరం. మళ్ళీ తెరిచి చూశాన అయోమయంగా.

"అమ్మా!

లోకంలో నీలాంటి దయగల తల్లులచేత ఆదరించబడటం నాలాంటి అనాథల అదృష్టమే అయినా నేనా అదృష్టాన్ని స్వీకరించలేని దురదృష్టవంతురాలిని. పన్నెండేళ్ళవయస్సునుంచి నాలో చెలరేగుతున్న విప్లవం తీవ్రమయి ఇప్పటికి రూపం దాల్చింది. వాతావరణం మార్పుతో నాలో మార్పును కోరి ఇంత దూరం పంపావు చదువుకు. నాలో పేరుకుపోతున్న నిర్లిప్తతకూ, ఒంటరితనానికీ ఇది దోహదం అయింది. అది భరించలేకే గమ్యంలేని ఈ ప్రయాణం. అనాథగా ఈలోకంలోకి వచ్చినదాన్ని అనాథగానే వెడుతున్నాను. ఇదే నా అంతిమలేఖ.

నన్ను క్షమించు.
పాప."

పాపకు నే నివ్వలేక పోయిందేదో ఇప్పుడు నాకళ్ళముందు నిలిచింది. మాతృత్వం ఎరగని నా జీవితంలో పాపకు నేనివ్వగలిగిన మమకారం అతి స్వల్పం. నవమాసాలూ మోసి రక్తంలో రక్తం జీవంలో జీవం పంచుకుని జీవన్మరణ సంఘర్షణలో భూమిమీదపడ్డ పసిబిడ్డవైపు తల్లి చూసే చూపులోని మమకారం! అదే....పాప కోరుకున్నదీ, నే నివ్వలేక పోయినదీ.

నా లోపం నా కళ్ళముందు స్పష్టంగా నిల్చింది. నాలో నిగూఢంగా ఉన్న ఈ సంచలనాన్ని, ఆత్మీయతనూ, అనురాగాన్నీ వ్యక్తం చేయగలిగే శక్తి లేకపోవటమే నా నేరం. ఇదే పిన్ని ఆప్యాయతనుంచి వంచించింది. ఇదే సారథి ప్రేమనుంచి వంచించింది. ఆఖరికి పాపని దూరం చేసిందీ ఇదే.

నా కళ్ళముందు వరసగా అమ్మా, నాన్నా, పిన్నీ, యామినీ టీచర్, హెడ్మిస్ట్రెస్, సారథి, పాప అంతా మెదిలారు. జీవితంలోని అన్ని రంగాలలోనూ ఓడిపోయాను. దుఃఖభారంతో నాగుండె జడత్వాన్ని పొందింది. ఇక నే నెవరికీ అక్కర్లేదు. నా కెవరూ అక్కర్లేదు. బాధతో ఆఖరి విషాదాశ్రువు రాలిపోయింది.

ఆశలూ, నిరాశలూ, దుఃఖం, వీటన్నిటి మలుపుల్లోను తిరిగిన నా జీవనస్రవంతిలో తడి ఇంకిపోయింది. ఏ అదృశ్యశక్తి నన్ను జీవితం వెంట పరిగెత్తించి ఈ ఎండమావుల వద్దకు చేర్చిందో ఆ మహత్తరశక్తి నన్ను జడత్వంలోనికి నెట్టింది.

నాలోని చైతన్యానికి చివరి దశ ఇది. సముద్రం ఘోష పెడుతూంది. కెరటాలు ఒడ్డును తాకి ఎవరికోసమో నిరీక్షించి నిరాశగా వెనక్కి వెళ్ళిపోతున్నాయి. ఇది నా జీవన గ్రంథంలోని చివరిపేజీ. ఈ జీవితయాత్ర ఎన్నాళ్ళు? ఎవరి కోసం బ్రతకాలి? దేనికోసం? మృత్యువు కోసమేమో!

తలెత్తి చూశాను. ముసురుకుంటున్న మసక చీకట్లలో దిగంతాలవరకు వ్యాపించిన సముద్రం, భీకరంగా శబ్దం చేస్తూ విరుచుకుపడే అలలూ, అలల తాకిడికి బాధతో నల్లగా కమిలిపోయిందా అన్నట్లున్న ఆ రాతిగుట్ట . . . ఒంటరిగా , . . విశృంఖలంగా . . . ఏకాకిలా నిలిచింది, సముద్ర మధ్యంలో. ★